

# నక్షత్రకాంతి

'చలం'

రాత్రయింది. నేనూ నామిత్రుడూ భోజనం చేసి అతని ఇంటిముందు నులకమంచంమీద చేరాము. సిగరెట్ పీలుస్తో మంచంమీద పడుకున్నాడు అతను. గూట్లో పెట్టిన అతని పావురాలు సంసారపు సంపకాల తగూలాడుకుంటో గోల చేస్తున్నాయి చీకట్లో. ఏదో సందేశం చెప్పే ఆతృతతో కళ్లువిప్పి కిందికి చూస్తున్నాయి మాచుట్టూ నక్షత్రాలు. ప్రొహిబిషన్ వొచ్చినతర్వాత వూళ్ళో ఎన్ని సరదాలు పోయినాయో, ఎన్ని సంసారాల్లో తగూలు ఎక్కువైనాయో; ఎందరు భార్యలకి కంటకంగా వున్నాయో, వర్ణిస్తున్నాడు నవ్వుతో నామిత్రుడు. గాంధీగారి అహింసని తోసిపుచ్చి, ఆయన బూడిదని కలశాల్లో మందులాగు ప్రతి జలాశయంలో చల్లటంలో ఆయన ఆత్మని సంతుష్టి పరచమనే ఆయన అనుగు అనుచరుల ఆత్మవంచనని గురించి ఆలోచిస్తున్నాను.

"అనంతమైన ఆకాశం. ఎక్కడికో, దేనికో, అందనిదానికై ఆహ్వానించే ఈ నక్షత్రాలు, జీవితమంటే మట్టిలోంచిపుట్టిన యీ శరీరం మాత్రమే కాదని, ఎట్లాగో పైనించి వర్షించే ఆ ధగధగతో పెనవేసుకుందని, కళ్ళ ఎదట ప్రతిరాత్రీ ఇంత విడవకుండా జ్వలించకపోతే, మానవుడి చరిత్ర ఇంకో విధంగా వుండేది, అతని స్వభావమే ఇంకా కృత్రిమంగా వుండేదనుకుంటాను. ఇంకా మనం కొంచెం కవిత్వంలోకి వెళ్లి మాట్లాడితే, యీ నక్షత్రకాంతి వల్లనే మానవుడి హృదయంలో అర్థం కాని యీ శాంతి; మామూలు బతుకుని మరిపించి దాటి నిద్రలో వింతవింత కలలు అనవొచ్చు. ఆకాశం కనపడుతున్నంతకాలం, దేవుడను ఏమను, తన శరీరం కనులకన్న ఉన్నతమైనదాని ధ్యానంలోంచి తప్పించుకోలేడు మనుషులు."

"ఏమో లే. ఆ రోజులు చాలావరకు భూతకాలంలోపడ్డాయి. మనిషి అంటే రోజుకో శేరు బియ్యం ఖర్చుచేసే యంత్రంకింద లెఖ్ఖల్లో పడ్డాడు. ప్రపంచాన్ని పాలించే ఏ నాయకుడైనా ఆ లెఖ్ఖల్నించి తప్పించుకోలేడు. అంతకన్న సాధించేవాడు ఈనాడు పనికిరాడు. ఎంత పండుతుంది? పండితే ఎంత వొస్తుంది. తరుగుని ఎట్లా భర్తీచెయ్యడం? రాజ్యాలు, యుద్ధాలు, రాచకీయాలు అన్నీ యిదే ఇరుసుమీద తిరుగుతున్నాయి."

"మరి తిండేకద ముఖ్యం. అది లేంది..."

"అవును లే. కాని అది తప్ప ఇంకేం లేకండా పోతోంది ఎవరి మనసుల్లోనూడా. తక్కినవన్నీ నిర్బంధకాలూ, విరోధులూ అవుతున్నాయి. 'వందే మాతరం - సస్యశ్యామల శోభితాం,' దృష్టి భూమి మీద మాత్రమే. ఆకాశంవంక చూడడానికి తీరు బడివున్నవాణ్ణి, 'తోడి మానవుడికోసం కష్టించ కండా, వాడి బియ్యాన్ని ఉచితంగా తిని ఆకాశం వంక చూస్తున్నావా ?' అని అడుగుతున్నాడు. కళలు, ఫిలాసఫీలు, కవిత్వాలు అన్నీ ప్రజాభ్యుదయానికి తోడ్పడాలి. అంటే శరీరసౌఖ్యానికి మాత్రం, అని అర్థం వొస్తోంది. ప్రభుత్వం ఎందుకు ? ప్రజల్ని శాంతంగా వుంచడానికి. అంటే ఒకర్ని ఒకరు చంపుకోకండా, శాంతంగా బతికె, తిని పిల్లల్ని కనమని. అంతకన్న ఏ కలలుకన్నా, యత్నంచేసినా, అది వ్యర్థమో, కలవరానికి కారణమో అవుతోంది. అందువల్లనే కళలూ సారస్వతమూ క్రమంగా ప్రభుత్వాలు అధీనం చేసుకుంటున్నాయి. అందమైన కలలు కనగల ఉన్మత్తుల చేతుల్లోంచి."

"ఏం ? తప్పేముంది ?"

"ప్రభుత్వమంటే, ప్రజలోయ్. ప్రజలంటే మామూలు సగటు మనిషి. అతను అంగీకరించిందే కళ. అతను కళకింద దేన్ని అంగీకరిస్తాడో తెలుస్తోనే వుంది."

"మరి వాళ్ల అభిరుచిని ఉన్నతంచేద్దాం."

"రైట్. ఇదివరకు ఆపని దౌర్భాగ్యుడైన ఆర్టిస్టు చేసేవాడు, తాను ఏ అంగీకారాన్ని కీర్తినీ పొందక పోయినా, కళకి తన జీవితాన్ని అర్పించుకోడమే ధన్యమనుకుని. ఇప్పుడు ప్రజాదరణని, ప్రభుత్వాదరణని పొందని ఆర్టిస్టుకు చోటువుండదు. అతను రాసేదీ పాడేదీ అర్థం కాకపోవడంవల్ల, అతని ఉన్మాదం విప్లవహేతువని చాలా శీఘ్రంగా నోరు నొక్కుతారు. స్వతంత్రమంటే, తనభాగం పనిచేసి తనభాగం బియ్యం తినడానికి స్వతంత్రం. నక్షత్రాలు లెఖ్ఖలోకి రావు. వాటి వెలుగుకి కిరసనాయిలూ, అగ్గిపుల్లలూ ఎంచనవసరం లేదు గనక."

"స్వతంత్రమంటే తినడానికీ, శరీరాన్ని సుఖపెట్టడానికీ అని అర్థం ఇప్పుడు. ఈ స్వతంత్రం కోసం, మనస్సునీ, నీతినీ, ఆత్మనీ, ప్రభుత్వ పరం చేస్తామంటున్నారు. ఎందుకూ ? వాళ్లని ఇబ్బంది పెట్టే మనోవిజృంభణగాని, కళా ప్రోద్బలంగాని, విశాలదృష్టిగాని చాలామందికి లేవు. శరీరంలోతప్ప ఇంకో అవసరానికి బతకడమంటే ఏమిటో అర్థం కాదు."

"కాని రోజుకా శేరుబియ్యం దొరక్కపోతే, నక్షత్రాలవంకచూసే వోపికవుండదు."

"అవును ఆ శేరుబియ్యం దొరికినవాళ్లలో చాలామందికి నక్షత్రాలవంకచూసే దృష్టిలేదు. అంతే కాదు. బాగా ధనంతో తులతూగేవాళ్లకి అసలు లేదు. శరీరమో హృదయమో ఓపక్కమాడేవాడికే ఇవన్నీ. శేరుబియ్యంలేని రోజులు నేనెరక్కపోలేదు. కాని, ఆకలికన్న బాధపెట్టేవీ, తిండికన్న సంతుష్టిపెట్టేవీ వున్నాయి మరి. నక్షత్రాలనుకో. వాటిని మరిచిపోయిన రోజునే, మనిషి వుత్తతిండిమరఅవుతాడు. కళ ప్రజాసేవకి దాసురాలవుతుంది. చాతకాదుగాని ఆ నక్షత్రాలని రోడ్డుమీద వరసగా తగిలించుకుంటారు."

"ఎందుకు ;"

ఆకాశంలో అనవసరం. వేస్టు. అదిగాక వెర్రికలలతో ఆశలతో కలవర పెడుతాయి జీవితాన్ని."

" ప్రజలలో దయా, పరస్పర సహాయం, ఏకత్వం, ఉందని మరిచి, వన్యమృగాలకన్న హీనంగా ఒకర్ని వొకరు చంపుకోడానికీ, పీక్కోడానికీ పుట్టారనీ, అదే మానవుడి నైజమని నమ్మబట్టేకద, ఆ నమ్మకంమీద ప్రజల్ని తయారుచెయ్యడం బట్టే కద, ప్రభుత్వాలు లాప్రకారం పంచడం. శేషన్లూ ప్రజల్ని ప్రజలు, దేశాన్ని దేశాలు విద్వేషించి, పోటీపడి, దోచుకోవాలనే ప్రయత్నాలు, ఎవరికె దొరికింది వారు ధర్మంతో న్యాయంతో నిమిత్తం లేకుండా దోచుకుని, దాచుకుని అనుభవించాలని ఈ ప్రయత్నం."

"ఇదంతా ధనవంతులువిన కొద్దిమంది చేస్తున్న దుర్మార్గమేగా ?" "అవును. 'ఏదినీది' ఏదినాది ? అని వాళ్లది లాక్కోవాలనిచూస్తే వాళ్లకిన్యాయబుద్ధి అంతరించి పోటీపెరిగి, ప్రజాక్షేమాన్ని మనసునించి తోసేసుకుంటారు. అదే—వున్నకాస్తా."

"ఎన్నాళ్లుతే."

"సాగినన్నాళ్లే అనుకో."

"అవును మరి ఆ పాతనమ్మకాలు పోయినాయి. దేవుడిచ్చాడు. కనక ఇది నాది. నువ్వు పెట్టి

పుట్టలేదు. గనకదరిద్రం నీది అనే రకం విశ్వాసాలు పోయినాయి. మంచిదే కదఅది!"

"మంచిదే. కాని, ఆ విశ్వాసాలు పోవడంతో వాటితోపాటు విశ్వాసాలమీద ఆధారపడని, నీ హృదయంలోని సానుభూతీ, దయా, స్నేహం, పరస్పరసహకారం-ఇట్లాంటివన్నీకూడా తొలగిపోయినాయి. అందువల్లనే ప్రపంచం నైతికంగా ఇంత దివాలా తీసింది. ప్రజలలో ఒకరికీ ఇంకొకరికీ తగాదాలు అనుమానాలు ఎక్కువై, ప్రతి అవసరాన్నీ ప్రభుత్వమే తీర్చాలని కోరుతున్నారు. తిండి, తాగుడు అమ్మకం, పల్లెటూళ్ల శాంతి, పెళ్లిళ్లు—వ్యభిచారం, అన్నీ ప్రభుత్వం రక్షణకిందికె వొస్తున్నాయి. పత్రికలు, ఫిల్ములు, పుస్తకాలు సమస్తమూ."

"ఇంతకీ ఏంచెయ్యమంటావు; పాతపురాణాల దేవుడూ, ధర్మమూ మళ్లీ బోధించమంటావా; వాటిపట్లు ఎప్పుడో వొదిలిపోయినాయి.

"ఎక్కడవొదిలాయి? సినీమాలు చూడు."

"మరి ఏమంటావు."

"సినిమా పరిశ్రమసంగతి అదొక్కటేకాదు. సామాన్యప్రజమీద ఆధారపడ్డ ఆ పరిశ్రమకి ఎన్నటికీ గతులు లేవనుకో. క్రమంగా యీ ప్రజాధికారం తక్కినకళలమీదికికూడా పాకుతోంది."

"ఐతే యీ కళాపరిశ్రమల్ని ప్రభుత్వమే తీసుకుని విలువగల వాటిని ప్రజలకి బలవంతాన ప్రదర్శించాలి."

"ప్రభుత్వమంటే ప్రజలని మరిచిపోకు. వాళ్లెన్నుకున్న నాయకులనుకో పోనీ. ఆ నాయకుల్ని ఎందుకు నాయకులుగా ఎన్నుకుని పదవుల్లోకూచోపెడతారో, నీకు తెలీనిదికాదు. పోనీయి. ప్రభుత్వం నియమించే కళాధినేతలు ఎటువంటివారైవుంటారో నువ్వు వూహించవొచ్చు. ఏదోపొరపాటున గొప్ప కళనిప్రదర్శించావా, వెంటనే ఆందోళన పెడతారు ప్రజలు ఈ అర్థంలేని చెత్తనంతా మా మొహాన రుద్దుతారా? అని."

"నీ కళఎవరికి కావాలోయ్! లేకపోతేనేం, దానికోసం పడిచచ్చేది చాలా కొద్దిమంది, మరి ప్రజాబాహుళ్యంకోసం వాళ్లు త్యాగం కావాలి, ఏం చేస్తాం?"

"నా గొడవవిను, అసలుసంగతి ఏమిటంటే—మనం చూసే యీజీవితం, ప్రతిక్షణమూ మారుతో పొంగుతో, అణుగుతో, అల్లరిపడే యీప్రజాజీవితం వుత్త అలలు అంటాను. వీటి అడుగున గొప్ప లోతులేని సముద్రంవుంది, అలలనిచూసి సముద్రమంతా ఇంతేననుకుంటున్నారు. ఆ సముద్రం వూరుకోదు. ఈ అలల్ని కలవరపెడుతుంది. ఆట్లుపోట్లు, ఉప్పెనలు, తుపానులు, అప్పుడప్పుడు దొరికేముత్యాలు,—వీటన్నిటినీ ఏవేవో చెప్పుకుని అప్పుడే మరిచిపోతారు. ఆ సముద్రంసంగతి. ఏ స్వల్పమో గ్రహించిచెప్పే చాలాగొప్ప సయన్టిష్టులకీ, కవులకీ, గాయకులకీ కాలంకాదు. వారివాణిని వినగల ఆసక్తికూడా పోతోంది యీనాటి ప్రజలకి. పైగా వుత్త మూర్ఖమని వాళ్ల నోర్లు నొక్కుతున్నారు. వెర్రివాళ్లు అని వాళ్ళని వుపేక్ష చేస్తున్నారు. సముద్రంతో సంబంధం మరిచిపోయిన కొద్దీ అలల అలజడి, స్వరూపం, ఏమీ అర్థంకాదు. అర్థం కనపడదు. కనపడని కొద్దీ అశాంతీ, జీవితంలో అర్థహీనత్వం, ఎక్కువౌతుంది. అసలు సముద్రం సంగతిపూర్తిగా మరిపిస్తేనేగాని, అలలు ఒక తీరుకీ, శాంతికీ, రావనుకుంటున్నారు.

"ఇన్ని గొప్ప యత్నాలు జరుగుతున్నాయి నూతన లోకశాంతి అంటారు. కాని ప్రజల మనసుల్లో ఎంత విశ్వాసం తక్కువయిందో, ఎంత అశాంతి ప్రబలిందో చూస్తున్నావా? జీవితం వెనకఉన్న అగాధం సంగతి ప్రజలకి విరివిగా చెప్పగల సామర్థ్యంగల ప్రవక్తలలో చివరివారు ఈ లోకానికి గాంధిగారేనేమో అనిపిస్తుంది."

"ఎందుకుకీ సొద? ఏం చేస్తావు మరి!"

"ఏంలేదు. చందమామనిచూసి కుక్కఏడ్చినట్లు, నక్షత్రాల్నిచూసి నీతో నా హృదయబాధని చెప్పుకున్నాను."

"ఏం లాభం లేదంటావా?"

"మానవుడి హృదయంలోని స్వర్గాన్ని మానవుడికి విప్పిచూపగల ప్రవక్త జన్మించాలంటాను."